క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

నవ వధువుకు బంగారు తాళిబొట్టు అందజేత

అల్లిపురం: రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. 34వ వార్డులో గల రాణి అనే యువతికి తల్లిదండ్రులు చనిపోవడంతో ఆమె సమీప బంధువులు ఆమెకు వివాహం నిశ్చయించారు. విషయం తెలుసుకున్న కందుల నాగరాజు ఆమెకు బంగారు తాళిబొట్టు, పట్టుచీర, పసుపు, కుంకుమ తదితర వస్తువులు అందజేశారు. శివప్రసాద్‌రెడ్డి, కందుల బద్రీనాథ్, కేఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ కేదార్‌నాథ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వంలో ప్రజల గొంతు ప్రతిధ్వనిస్తుందన్నారు. సహృదయతే విధానమై, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని తన కవిత్వంలో కవి ఆవిష్కరిస్తాడని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి గొప్పతనాన్ని, సంగీత విశిష్టతను వివరించారు. వి.ఎస్.ఎన్.మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, చిన్న సూర్యనారాయణ, రామతాత, జి.ఎస్.వి.మాణిక్యాలరావు తమ కవితలు చదివి వినిపించారు.

సకాలంలో వ్యాక్సిన్లు ఇవ్వాలి



అధికారులతో చర్చిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సకాలంలో వ్యాక్సిన్లు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బుధవారం కేజీహెచ్‌లో పలు శాఖల అధికారులతో మాట్లాడారు. హెచ్‌బీ,హెచ్‌ఐవీ తదితర వ్యాక్సిన్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, డాక్టర్ ఉమావతి తదితర అధికారులతో చర్చించారు.

41వ వార్డులో కార్పొరేటర్ పూర్ణిమ పర్యటన



వార్డులో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేన్యూకాలనీలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ బుధవారం సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. వార్డు సమస్యలపై ఆరా తీశారు. కాలువలు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్ లైట్లు, మంచినీటి సరఫరా వంటి సమస్యలపై స్థానిక ప్రజలు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యలను జోన్–5 అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రజలకు హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విడనాడితే.. పర్యావరణ హితం

- సురక్షిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం
- మేయర్ హరివెంకటకుమారి



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రాజాబాబు. చిత్రంలో మేయర్ హరి వెంకటకుమారి

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్‌ను విడనాడండి.. ఆహ్లాదకర వాతావరణ నెలకొల్పండి అని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. బుధవారం సాయంత్రం పూర్ణామార్కెట్ వద్ద ప్లాస్టికేతర కవర్ల దుకాణం (కియోస్క్ వెండర్ షాపు)ను కమిషనర్ రాజాబాబు, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో విశాఖ నగరాన్ని ప్లాస్టికేతర నగరంగా తీర్చిదిద్దడానికి జీవీఎంసీ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే నగరానికి ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి.. ముఖ్యంగా ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా.. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయమైన ఉత్పత్తిని ప్రజలకు పరిచయం చేస్తున్నాం అన్నారు. మట్టిలో తొందరగా కలిసిపోయే షుగర్‌కెన్ వ్యర్థాల నుంచి తయారు చేసిన కవర్లు, జ్యూట్ బ్యాగ్‌లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పూర్ణామార్కెట్, జగదాంబ, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. తరువాత కంచరపాలెం, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ మానవవాళికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఏడాదిగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్‌ను వదిలి పర్యావరణ హితమైన కవర్లు ఉపయోగించడం వలన భావితరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన కియోస్క్ స్టాళ్లను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మొదటి కవర్ల బ్యాగ్‌ను మేయర్ పూర్ణామార్కెట్ వ్యాపారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సన్యాసిరావు, సీఎంహెచ్‌వో డాక్టర్ కేఎల్ఎస్ శాస్త్రి, జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సీతమ్మధార : ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణేంద్రకుమార్ మాట్లాడుతూ అనంత పురం జిల్లాలో చదువుతున్న భవ్యశ్రీ అనే విద్యార్థినిని అక్కడి కళాశాల యాజమాన్యం ఫీజు కట్టాలని.. లేకపోతే రికార్డులు ఇవ్వబోమని భయభ్రాంతులకు గురి చేయడంతో కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. అలాగే విశాఖలో నాలుగో వార్డులోని రెసిడెన్షియల్ హాస్టల్లో అమ్మాయి చనిపోయిందన్నారు. వీటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని.. తక్షణమే ఆయా కళాశాలలను సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీ ఆదాయం రూ. 1.76 లక్షలు



ఆలయ ఆవరణలో హుండీలు లెక్కిస్తున్న ఆలయ ధర్మకర్తలు తదితరులు

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేప చెట్టు అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం రూ.1,76,367 వచ్చిందని ఆలయ ఈవో ఎ.దేవుళ్లు తెలిపారు. అమ్మవారి ఆలయ హుండీలు బుధవారం తెరిచారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొరారా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు లక్ష్మీకాంతం, కన్నూరు గంగ, భీమరౌట్టి చంద్రకళ, శ్రీహరి సేవా మండలి సభ్యులు, ఆలయ అర్చకుడు జోగారావు శర్మ తదితరులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.

కెనాల్‌ను శుభ్రం చేయాలి



కెనాల్లో చెత్తను పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: కెనాల్లోని చెత్త తొలగించి శుభ్రపరచాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె. శివప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. బుధ వారం ఆయన జోన్ పరిధి 35వ వార్డు పోర్టు వద్ద ఉన్న కెనాల్‌ను పరిశీలించారు. కెనాల్లోని చెత్తను చూసి సిబ్బందిపై మండిపడ్డారు. ఇలా అయితే నీరు ఎలా ప్రవహిస్తుందని సిబ్బందిని ప్రశ్నించారు. జోన్ పరిధిలో అన్ని వార్డుల నుంచి వచ్చే మురుగు నీరు కెనాల్లో చేరుతుందని.. దానిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. సిల్ట్ కూడా తీసి నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వార్డులో కాలువలు, రహదారులను పరిశీలించారు. చెత్తకుప్పలు రహదారులపై ఉండకూడదన్నారు. రోజూ ఉదయం వేళల్లో చెత్తను యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ సింగూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బడ్డీ తొలగింపు



అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీని తొలగించిన తర్వాత ఖాళీగా ఉన్న ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని కళా హాస్పిటల్ ఎదురుగా అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీని జీవీఎంసీ అధికారులు తొలిగించారు. సాక్షి దిన పత్రికలో బుధవారం ‘అక్రమ బడ్డీ ఏర్పాటు’ అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో జీవీఎంసీ అధికారులు బుధవారం తొలిగించారు. ఆ ప్రాంతంలో బడ్డీలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది.

బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతుల పంపిణీ



లబ్ధిదారుకు అమర్చిన కృత్రిమ చేతులను పరిశీలిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

తాటిచెట్లపాలెం : రోటరీక్లబ్ ఆఫ్ విశాఖపట్నం సెంట్రల్, రోటరీ క్లబ్ ఆఫ్ పూనా డౌన్ టౌన్, కరూర్ వైశ్యాబ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ సహకారంతో ఇనాలి ఫౌండేషన్ రైల్వే న్యూకాలనీలో గల విశాఖ సేఫ్టీ కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం ఉచిత బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతులను పంపిణీ చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీవీఎంసీ మేయర్ జి హరివెంకట కుమారి మాట్లాడుతూ పుట్టుకతో అంగవైకల్యం కలిగిన వారికి, మధ్యలో ప్రమాదాలలో చేతులను కోల్పోయిన వారికి కృత్రిమ చేతులను అందించడం అభినందనీయమన్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కరూర్ వైశ్యా బ్యాంక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సి.బాలసతీష్‌ను అభినందించారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా లబ్ధిదారులను ఎంపిక చేసి ఉచితంగా వారికి ఈ చేతులను అందజేశారు. గురువారం విశాఖపట్నం జిల్లా పరిసర ప్రాతాల వారికి ఈ శిబిరంలో కృత్రిమ చేతులను అమర్చనున్నట్లు బాలసతీష్ తెలిపారు. ఇటువంటి పరికరాన్ని అమర్చేందుకు ఒకొక్కరికి సుమారు రూ. 11వేలు ఖర్చు అవుతుందని, దీనికి సిఎస్ఆర్ నిధులతో కరూర్ వైశ్యా బ్యాంక్ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, రోటరీక్లబ్ విశాఖపట్నం సెంట్రల్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూనా డౌన్ టౌన్ నుంచి అనిల్ చద్దా, ఇనాలి ఫౌండేషన్ క్యాంప్ లీడర్ బి.అనికేత్, ఆంధ్ర మెడికల్ కాలేజ్, రోటరాక్ట్ మెడికోలు, రోటేరియన్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం



గురుకులంలో విద్యార్థులకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. కొత్తగా ఆధార్ నమోదుతో పాటు తప్పుల సవరణ, పేర్లు, చిరునామాలో మార్పులకు అవకాశం కల్పించినట్లు గురుకులం వైస్ ప్రిన్సిపాల్ బి.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు 80 మందికి ఆధార్ నమోదు చేశామన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు సువర్ణావకాశాలు



ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆవిష్కరిస్తున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక, సాంకేతిక రంగంలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిప్లమో కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరడానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రెండేళ్ల అనుభవం సాధించిన అనంతరం ఉన్నత చదువులు చదువుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం 17 ఏళ్లకే నెలకు రూ.20 వేలు నుంచి రూ.30వేలు జీతం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రూ.6.67లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని, నూతన ఆవిష్కరణలు రూపొందించి పేటెంటు హక్కు పొందేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌లో 833 ప్రాజెక్టులు రాగా.. ఇందులో పేటెంట్ హక్కుల కోసం 13 ప్రాజెక్టులు, ప్రొడక్షన్‌కు 55, ఇంక్యూబేషన్ విభాగానికి 53 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ చాప్టర్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా కెరీర్‌కు అవసరమైన సహకారం లభిస్తుందన్నారు. ఇందులో వారు పంపించిన ఉత్తమ సృజనాత్మక ఆలోచనలకు పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. బెస్ట్ ప్రాజెక్టులకు రూ.50 వేలు నగదు బహుమతి లభిస్తుందని తెలిపారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఆధునికీకరించిన కార్యాలయం, ఇన్నోవేషన్ కేంద్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. మెటలర్జీ విభాగానికి దాత సమకూర్చిన ప్రయోగశాల పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ టీపీవో విభాగం డీడీ డాక్టర్ ఎంవీపీ రామకృష్ణ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి కాలేజీ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో రుణ మేళా

మద్దిలపాలెం: యూనియన్ బ్యాంకు నిర్వహిస్తున్న రిటైల్ రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు పిఠాపురం కాలనీ బ్రాంచి చీఫ్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ మేరకు పిఠాపురం కాలనీ బ్రాంచి బుధవారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు, విద్యా రుణాలు అందిస్తున్నామన్నారు. బ్రాంచి పరిధిలో 33 మంది లబ్ధిదారులకు సుమారు రూ.10.03 కోట్లు రుణం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సిహెచ్.రమేష్, బిందు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాణేతిహాసాలు మానవాళికి మార్గదర్శకాలు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: పురాణ ఇతిహాసాలు మానవాళి జీవనానికి మార్గదర్శకాలని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మతో కలిసి ఆయన బుధవారం శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు కొద్ది రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ సనాతన పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తుల్లో విశేషమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. ఈ విజ్ఞానం మానవ మనుగడ, జీవన విధానానికి మార్గనిర్దేశంగా నిలుస్తుందన్నారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి, నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భమిడిపాటి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మణిరామ్

మహారాణిపేట : సమాచార శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన భమిడిపాటి జగన్నాథరావు సేవలు మరువలేనివని సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ అన్నారు. ఇటీవల మృతి చెందిన భమిడిపాటి జగన్నాథరావు సంతాప సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నివాళులు అర్పించారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మణిరామ్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో వివిధ హోదాల్లో పని చేసి పదోన్నతిపై గవర్నర్ ప్రెస్ సెక్రటరీగా, సమాచార శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన జగన్నాథరావు రచనలు పుస్తకాలుగా ముద్రించబడ్డాయన్నారు. 89 సంవత్సరాల వయసులో ఈ నెల 6న తుది శ్వాస విడిచారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రాంతీయ ఉప సంచాలకులు పి.గోవిందరావు, విశ్రాంత సహాయ సంచాలకులు ఆర్.త్యాగరాజు, సమాచార శాఖ సూపరింటెండెంట్ జీవీకేఎస్ ప్రసాద్, ఏఈ సీహెచ్ మల్లికార్జునరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పని చేయని లిఫ్ట్‌లతో పాట్లు

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



జోన్-4 కార్యాలయంలో పని చేయని లిఫ్ట్‌లు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో లిఫ్ట్ మూడు రోజులుగా పని చేయకపోవడం వలన వికలాంగులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సూర్యాబాగ్ వద్ద జీవీఎంసీ కార్యాలయం ఉంది. ఇక్కడ జోనల్ అధికారి కార్యాలయంతో పాటు టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, యూసీడీ, ఫైర్, పబ్లిక్ హెల్త్, సచివాలయ కార్యాలయాలు ఉన్నాయి. ఏదో ఒక పనిమీద రోజూ జోనల్ కార్యాలయనికి వ్యయ ప్రయాసలతో వచ్చే ప్రజలు లిఫ్ట్ లేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అనారోగ్యంతో ఉన్న కార్యాలయ ఉద్యోగులు సైతం ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జోనల్ కార్యాలయంలో ఉన్న రెండు లిఫ్ట్‌లకు మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో ఏవీఎన్ విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు తదితరులు

డాబాగార్డెన్స్: రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఏవీఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఏవీఎన్ విద్యార్థులు చాంపియన్‌షిప్ సాధించారు. బాలుర విభాగంలో ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ సాధించి ప్రతిభ చాటారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో వర్షిత్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. లాంగ్‌జంప్ విభాగంలో ధరణేశ్వరరావు వెండి పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు బుధవారం కళాశాలలో అభినందిస్తూ స్పోర్ట్స్ షూ, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మంగమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు, ఫిజికల్ డైరెక్టర్ గోపీకృష్ణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మహారాణిపేట తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మహారాణిపేట : మహారాణిపేట తహసీల్దార్‌గా జి.ఆనంద్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన రమామణి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. సీసీఎల్ఏలో సెక్షన్ పర్యవేక్షకుడిగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆనంద్‌కుమార్‌ను మహారాణిపేట తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌ను పలువురు రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

సమష్టిగా పరిశుభ్రతకు కృషి



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: అందరూ సమష్టిగా పరిశుభ్రతకు కృషి చేయాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు కోరారు. బుధవారం నరవలోని జామియా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్, ఇంక్లూజివ్ పాలసీ విభాగం నిర్వహించిన ‘ఎండింగ్ ఓపెన్ డెఫికేషన్ టువర్డ్స్ ప్రమోటింగ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్’ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలన్నారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా వర్సిటీ పరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేంద్రనాయుడు మాట్లాడుతూ సంప్రదాయ అడ్డుగోడలు తొలగించి పరిశుభ్రత, ఆరోగ్య భద్రత దిశగా అడుగేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.వరప్రసాద్, శానిటేషన్ సెక్రటరీ డాక్టర్ జి.జగన్నాథరావు, జామియా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కరస్పాండెంట్ షేక్ రహమాన్, డాక్టర్ జి.శాంతారావు, చుక్క క్రిష్టోఫర్, జోసఫ్ రాజు, టి.బుజ్జి పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. రాములవారి కల్యాణం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీ సీతారామాలయ 20వ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల వార్షిక కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాగణంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండవగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.